

అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
08 పేజీలు | శుక్రవారం 10 నవంబర్ 2023 | www.navatelangana.com

తల్లి లాంటి కాంగ్రెస్‌ను వదులుకోను

- 13వరకు హైకమాండ్ నిర్ణయం కోసం వేచిచూద్దాం
- మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం

8లో...



ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో అపశృతి

- మంత్రి కేటీఆర్‌కు తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయగా.. రైలింగ్ ఊడిపోయి ఘటన

వార్త మెయిన్ పేజీలో...





కామారెడ్డిలో నామినేషన్ వేస్తున్న సీఎం కేసీఆర్

నామినేషన్ల జోరు

- నిజామాబాద్‌లో 33.. • కామారెడ్డిలో 31 నామినేషన్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

రాష్ట్ర శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురువారం 33 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. అలాగే కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో మొత్తం 28 మంది అభ్యర్థులు 31 నామినేషన్లు వేసినట్టు కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. మిగతా 2లో...

త్వరలో కాళేశ్వరం నీళ్లు తెస్తా

- కేంద్రం తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలే
- రాహుల్‌గాంధీకి వ్యవసాయ భూముల విషయం తెలియదు.. అందుకే ధరణి రద్దు చేస్తామంటున్నాడు
- తెలంగాణతో తప్ప.. ఏ రాష్ట్రంలో బీడీ కార్మికులకు జీవన భృతి లేదు
- నామినేషన్ వేసి.. ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడిన సీఎం కేసీఆర్



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ-కామారెడ్డి

పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను అత్యంత తొందరలో పూర్తిచేసి సంవత్సరంలోపు ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలకు నీటిని అందిస్తామని కామారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి, సీఎం కేసీఆర్ అన్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు పరిశ్రమలు, విద్యాసంస్థలు ఎన్నో వస్తాయని, కామారెడ్డి నియోజకవర్గం రూపురేఖలు మారుతాయని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ 50 సంవత్సరాలు పాలించిందని 1956లో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అని సిటీ కాలేజ్ విద్యార్థులు ధర్నా చేస్తే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడుగురు విద్యార్థులను కాల్చి చంపిందని గుర్తుచేశారు. కేంద్రం నుంచి 157 మెడికల్ కాలేజీలు ప్రకటించి తెలంగాణకు ఒక్కటీ ఇవ్వలేదని విమర్శించారు. గురువారం కామారెడ్డిలో నామినేషన్ వేసిన అనంతరం ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. వార్త మెయిన్ పేజీలో...

బాన్సువాడ కాంగ్రెస్‌లో

అంతర్మథనం!

- నాయకుల ఒంటెద్దు పోకడ • ఐక్యతా లోపమే కారణం
- కలగా మారిన స్థానికులకు టికెట్



బాన్సువాడ నియోజవర్గం అసెంబ్లీ టికెట్ విషయంలో స్థానికులకు ఇవ్వకుండా స్థానికేతరులకు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాసుల బాలరాజ్ ఆత్మహత్యాయత్నం చేయడంతో ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. నామినేషన్ల ప్రక్రియ అతి దగ్గరలో ఉండడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు స్థానిక, స్థానికేతరుల సమస్య ఎదురైంది.

-నవతెలంగాణ-నసురుల్లాబాద్

2లో...

ఇద్దరు మృతి

- అనుమానాస్పదస్థితిలో..
- వేర్వేరు చోట్ల ఘటనలు

2లో...





సంజీవ్, హుస్సేన్ మృతదేహాలు

నవతెలంగాణ-విలేకరులు

అనుమానస్పదస్థితిలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలు వేర్వేరు చోట్ల గురువారం చోటుచేసుకున్నాయి. రామారెడ్డి మండల కేంద్రంలో విస్కీ తాగుతూ అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందగా.. కోటగిరి మండలంలోని లింగాపూర్ శివారు లింగమయ్య గుట్టలో కాల్చిచంపిన మృతదేహం లభ్యమైంది.

వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- జిల్లా మహిళా శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బావయ్య



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి బావయ్య

నవతెలంగాణ-కామారెడ్డి

వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో తగు ఏర్పాట్లు చేస్తున్నామని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవలసిందిగా జిల్లా మహిళా శిశు సంక్షేమం, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బావయ్య విజ్ఞప్తి చేశారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం కామారెడ్డి పట్టణంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ట్రాన్సజెండర్లు, వయోవృద్ధులకు ఓటరు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం 18 ఏళ్ళు నిండిన అందరికి ఓటు హక్కు కల్పించిందని, వృద్దులు, అంధులు ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని పోలింగ్ కేంద్రాలలో ర్యాంప్, వీల్‌చైర్, వాలంటీర్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. బాధ్యత గల పౌరులుగా తప్పక ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యాక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి నరేష్, సిడిపిఓ శ్రీలత, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఆదర్శ పాఠశాల 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం, కమిటీ చైర్మన్ నాగరాజు పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకొని మండల సా యిలో ర్యాంకులను సాధించాలని వారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు చిన్నప్ప, సుష్మ, అరుణ, జ్యోతి, సంతోష్, పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓటు వేయండి

- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ అన్నారు. గురు వారం నసురుల్లాబాద్ మండలంలోని రాముల గుట్ట తండా గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇటీవల విద్యార్థులకు ప్రవేశపెట్టిన అల్పాహారం, తెల్లకార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబానికి బీమా సౌకర్యం, సన్న బియ్యం, ఆసరా పెన్షన్ పెంపు, రైతుబంధు పెంపుతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌ను బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వారంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెం టీలను నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ కు ఓటు వేస్తే మూడు గంటల కరెంటు మాత్రమే వస్తుందని, సత్యసామలుగా ఉన్న సాగు భూములు కరెంటు పోతే బీడు భూములుగా మారుతాయని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేస్తే మూడు పంటలు పండుతాయన్నారు. ఎంపీపీ పాల్త్య విఠల్ జిల్లా కో ఆప్షన్ మెంబర్ మజీద్, సొసైటీ అధ్యక్షుడు సుదీర్ బాబు సర్పంచ్ గోపాల్, నాయకులు ఏడే మోహన్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఇద్దరు మృతి

- వేర్వేరు చోట్ల ఘటనలు

నవతెలంగాణ-విలేకరులు

అనుమానస్పదస్థితిలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటనలు వేర్వేరు చోట్ల గురువారం చోటుచేసుకున్నాయి.

రామారెడ్డి : మండల కేంద్రంలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన వంకలవాడి సంజీవ్ (33) దుర్గ వైన్స్‌లో విస్కీ కొనుగోలు చేసి, పక్కనే గల పర్మిట్ రూంలో విస్కీ తాగుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి అన్న మారుతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పదస్థితిలో మృతదేహం లభ్యం..

కోటగిరి : మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో లింగమయ్య గుట్టలో గురువారం మృతదేహం లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది గ్రామానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ (53) కుటుంబ కలహాల కారణంగా వర్ని మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. గురువారం గుర్తు తెలియని మృతదేహం లింగమయ్య గుట్టలో లభ్యమైనట్లు సమాచారం అందగా మృతదేహాన్ని వారి తండ్రి మృతదేహంగా గుర్తించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి కాల్చి చంపినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

బాన్సువాడ కాంగ్రెస్‌లో అంతర్మథనం!

- నాయకుల ఒంటెద్దు పోకడ
- ఐక్యత లోపమే కారణం
- కలగా మారిన స్థానికులకు టికెట్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజవర్గం అసెంబ్లీ టికెట్ విషయంలో స్థానికులకు ఇవ్వకుండా స్థానికేతరులకు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాసుల బాలరాజ్ ఆత్మహత్యాయత్నం చేయడంతో ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. నామినేషన్ల ప్రక్రియ అతి దగ్గరలో ఉండడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు స్థానిక, స్థానికేతరుల సమస్య ఎదురైంది.

2009 నుంచి బాన్సువాడ నియోజకవర్గంలో బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా కాసుల బాలరాజు కొనసాగుతున్నారు. గతంలో రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వగా.. స్వల్ప ఓట్లతో కాసుల బాలరాజు ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో కాసుల బాలరాజ్ కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్ వేయగా ఈనెల 8న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డికి అధిష్టానం టికెట్ కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఆయన మనస్థాపన చెంది బుధవారం బాన్సువాడ పట్టణంలో నిరాహార దీక్ష చేపట్టారు. సంఘీభావం తెలపడానికి వివిధ మండలాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు ఓదారుస్తుంటే టికెట్ రాలేదని తీవ్ర మనస్థాపం చెంది తన నివాసంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు వెంటనే బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ అధిష్టానం స్థానికులకు ఇవ్వకుండా స్థానికేతరులకు టికెట్ కేటాయించడం వలన నాయకులు కార్యకర్తలకు తీవ్ర నష్టం జరుగుతుందని సీనియర్ నాయకులు వారి అభిప్రాయం వ్యక్తం చేశారు. బాన్సువాడ టికెట్ కావాలంటూ బాన్సువాడ నియోజకవర్గ స్థానికులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా దరఖాస్తు చేసుకున్న వారికి ఎవరికి టికెట్ ఇవ్వకుండా ఒక రోజు ముందు బీజేపీ నుంచి వలస వచ్చిన ఏనుగు రవీందర్‌రెడ్డికి టికెట్ కేటాయించడంపై బాన్సువాడ కాంగ్రెస్ పార్టీలో అసమతి సెగలు అంటుకున్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో నాలుగు గ్రూపులుగా నాయకులు ఏర్పడ్డారు. రాజకీయ లబ్దికోసం కొందరు కాంగ్రెస్ పార్టీని బలి పశువు చేస్తున్నారని సీనియర్ నాయకులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

2018లో కాసుల బాలరాజ్‌కు టికెట్ వస్తే కొందరు కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని, అలాగే ఈ ఎన్నికల్లో పార్టీని భ్రష్టు పట్టించడానికి వర్ని మండలానికి చెందిన కొందరు బాన్సువాడకు చెందిన కొందరు కాంగ్రెస్ పార్టీ ఐక్యతను దెబ్బతీసేందుకై పన్నాగాలు వేస్తున్నారని ఆరోపణలున్నాయి. గత రెండు నెలల నుంచి స్థానికులకే టికెట్ ఇవ్వాలంటూ వర్ని కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టి కూర్చున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాగానే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికీ వచ్చినా సరే బాన్సువాడ కాసుల బాలరాజుకు టికెట్ ఇవ్వద్దంటూ కొందరు నాయకులు డిమాండ్ చేయడంతో అధిష్టానం వీరి ఐక్యత లోపల్ని గుర్తించి స్థానికేతరులకు టికెట్ కేటాయించడంతో స్థానిక కాంగ్రెస్‌లో నిరసన, అవమానం భరించలేక మనస్థాపం చెంది కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాసుల బాలరాజు ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలుస్తోంది. దీంతో అధిష్టానం అంతర్మథనంలో పడినట్లు తెలుస్తుంది.

ఒంటెద్దు పోకడే కారణమా?

బాన్సువాడ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న నాయకులు ఒంటెద్దు పోకడలతోనే స్థానికులకు టికెట్ ఇవ్వకుండా స్థానికేతరులకు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ కేటాయించిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఆరు మాసాలుగా బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా సమావేశాలు నిర్వహించకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్ల సమావేశం నిర్వహించడం, ర్యాలీలు నిర్వహించడం, ఎవరికి నచ్చిన విధంగా వారికి డబ్బులు ఆర్థికసాయం చేయడం, తమకు నచ్చిన విధంగా ఫ్లెక్సీలతో ప్రచారం చేయడం, నియోజవర్గ నాయకులు కలిసికట్టుగా పనిచేయకపోవడం, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలను పెడచెవిన పెట్టడం తనకు నచ్చిన నలుగురు కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేయడంతో ఇలాంటి సమస్యలు ఏర్పడినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. సీనియర్ నేతలు ఏ ఒక్కరినీ సంప్రదించకుండా ప్రచారం నిర్వహించడం, సలహాలు, సూచనలు తీసుకోకపోవడం కూడా ప్రతికూలంగా మారాయని అంటున్నారు. ఇప్పటికైనా నాయకులు ఐక్యంగా ఉండి ఒకరికొకరు సహకరించుకొని పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్ నాయకులు కోరుతున్నారు.

జుక్కల్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

- జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీ కాంతారావు

నవతెలంగాణ-బిచ్కుంద



మాట్లాడుతున్న తోట లక్ష్మీ కాంతారావు

జుక్కల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులను, నాయకులను, కార్యకర్తలను అందరినీ కలుపుకొని గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని, కాంగ్రెస్ పార్టీకి జుక్కల్ నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకొస్తామని జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. గురువారం బిచ్కుంద మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయనను గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫేస్టోలో పొందుపరిచిన ఆరు హామీలు ప్రతి ఇంటికి తిరుగుతూ పేదవారికి లబ్ధిచేకూరే విధంగా ప్రచారం నిర్వహిస్తామని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే గంగారంను కలుపుకొని ఆయన సూచనలు సలహాల మేరకు అసంతృప్తులను ఏకతాటిపై తీసుకొచ్చి ప్రజల్లోకి వెళ్లి ప్రచారం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం నిజాంసాగర్ మండలంలోని భోగ్గు గుడిసె నుంచి మద్నూర్ వరకు ర్యాలీగా బయలుదేరి నామినేషన్ వేస్తానని అన్నారు. తాను గతంలో జర్నలిస్టుగా పనిచేశానని జర్నలిస్టుల కష్టాలు ఏమిటో దగ్గరుండి చూసానని తాను గెలిచిన తర్వాత ప్లాట్లు, సొంత ఇంటి నిర్మాణం, గౌరవ వేతనం అందించేం దుకు తాను కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు కమల్ కిషోర్, బంజారానాయకులు నౌషానాయక్, పుల్లన్ విట్టల్, నూకలరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ గురువారం మండల సమీపంలో జీఎన్ఆర్ గార్డెన్లో ఏర్పాటుచేసిన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్యే జనార్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆహ్వానించారు. అదేవిధంగా ఐలాపూర్ సర్పంచ్ ధనలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు కమ్మరి సుగుణ వెంకటేశం, మూన్యా నాయక్, మాజీ ఎంపీపీ వడ్ల భీమయ్య, లింగంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు మన్నె భాగవ, లింగంపేట్ మాజీ సర్పంచ్ బాలమణి లక్ష్మణ్, లింగంపల్లి మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, ఐలాపూర్ కురుమ సంఘం సభ్యులు తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మౌలాలి తాండ గ్రామం నుంచి సర్పంచ్ జాదవ్ సునీత బాబునాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ అభ్యర్థి మహమ్మద్ షకీల్ అమీర్ నామినేషన్ వేయడంతో ఈ గ్రామం నుంచి అధిక సంఖ్యలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు

నామినేషన్ల జోరు

-మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సెగ్మెంట్ నుండి ఎస్.కె.మాజిద్ (మజ్లీస్ బచావో తెహ్రీక్), ఆశన్నగారి జీవన్ రెడ్డి (బీఆర్ఎస్), తాళ్లపల్లి శేఖరయ్య (విద్యార్థుల రాజకీయ పార్టీ), గండికోట రాజన్న (బీ.ఎస్.పీ), పి. వినయ్ కుమార్ రెడ్డి (కాంగ్రెస్) నామినేషన్లను సమర్పించారని, బోధన్ సెగ్మెంట్ నుండి పి.సుదర్శన్ రెడ్డి (కాంగ్రెస్), మోసిన్ (ఎం-సీపీఐ), డి.నాగరాజు (ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్), వి.మోహన్ రెడ్డి (బీజేపీ), మొహమ్మద్ షకీల్ ఆమిర్ (బీ.ఆర్.ఎస్), షేక్ జలీల్(స్వతంత్ర), సాయం మురళి (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు వేశారని అన్నారు. బాన్సువాడ సెగ్మెంట్ నుండి పరిగె భాస్కర్ రెడ్డి (స్వతంత్ర), పందిరి గంగామణి (స్వతంత్ర) అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారని అన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుండి మొహమ్మద్ షబ్బీర్ అలీ (కాంగ్రెస్), బి.లలిత(స్వతంత్ర), పడకంటి రాము (స్వతంత్ర), దత్తురామ్ ఖతల్ (రాష్ట్రీయ సమాజ్ పక్ష), దండి లత (బహుజన్ లెఫ్ట్ పార్టీ), బిగాల గణేష్ (బీఆర్ఎస్), ఫజల్ కరీం (ఎన్సీపీ), మహేష్ బిగాల (బీఆర్ఎస్), ఎం.శివకుమార్ (స్వతంత్ర), ధన్ పాల్ సూర్యనారాయణ (బీజేపీ), మొహమ్మద్ మన్సూర్ అలీ (అన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ) అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారని వివరించారు. నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ నుండి బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్), బాజిరెడ్డి జగన్ మోహన్ (స్వతంత్ర), ఆర్.భూపతి రెడ్డి (కాంగ్రెస్), ఎం.శేఖర్ (బీ.ఎస్.పీ) అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారని అన్నారు. బాల్కొండ నియోజకవర్గం నుండి వేముల ప్రశాంత్ రెడ్డి (బీ.ఆర్.ఎస్), పళ్ళికొండ నర్సయ్య (బహుజన సమాజ్ పార్టీ), ఎం.బోజన్న (ధర్మసమజ్ పార్టీ), ముత్యాల సునీల్ కుమార్ (కాంగ్రెస్) అభ్యర్థులుగా నామినేషన్ వేశారని కలెక్టర్ తెలిపారు. కాగా, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయిన నాటి నుండి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 70 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆర్మూర్ సెగ్మెంట్ నుండి నేటి వరకు 11నామినేషన్లు దాఖలు కాగా, బోధన్ సెగ్మెంట్ లో 13 , బాన్సువాడలో 8, నిజామాబాద్ అర్బన్ లో 21, నిజామాబాద్ రూరల్‌లో 10, బాల్కొండ నియోజకవర్గంలో 7 నామినేషన్లు దాఖలయ్యాయి.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి నియోజకవర్గంలో 12 మంది అభ్యర్థులు 14 సెట్ల నామినేషన్, జుక్కల్ నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 6 గురు అభ్యర్థులు 7 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని కలెక్టర్ తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబం ధించిన ఆస్తులు, అప్పులు, నేరచరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయ నోటీసు బోర్డులపై ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుం దన్నారు. కామారెడ్డి సెగ్మెంట్‌లో భారత రాష్ట్ర సమితి నుంచి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థి బోడసు నర్సి ములు రెండు సెట్ల నామినేషన్ వేశారు. ప్రజా సేన పార్టీ నుండి ఆకుల హనుమండ్లు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుండి మొహమ్మద్ ఆరిఫ్, స్వతంత్ర అభ్యర్థులుగా గబ్బుల నాగేం దర్, సుదర్శన్ ఆంధ్రప్పు, పి.రాజేష్, మహమ్మద్ ఖలీలుల్లా, పప్పు రాజు, బరిగేలా శివ చెవుల పరశురాములు, బుట్టెమ్‌గారి మాధవరెడ్డి ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ తెలిపారు. జుక్కల్ సెగ్మెంట్‌లో ఇండి యన్ నేషనల్ కాంగ్రెస్ నుండి గంగారాం సౌదాగర్, తోట లక్ష్మీకాంత రావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుండి వాగ్మారే గంగాధర్, బహుజన్ ముక్తి పార్టీ నుండి కందరపల్లి కాశీనాథ్, ప్రజాశాంతి పార్టీ నుండి కర్రోళ్ళ మో హన్, స్వతంత్ర అభ్యర్థులుగా గంగారాం సౌదాగర్, సంజీవ్, కాంబ్లే నాందేవ్, బక్కవార్ సాయిలు, జి.లక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు. ఎల్లారెడ్డి సెగ్మెంట్‌లో బిజెపి నుండి బాన్సువాడ సుభాష్ రెడ్డి రెండు సెట్లు, బి.ఆర్.ఎస్. సురేందర్ జాజాల, ప్రజాశాంతి పార్టీ నుండి బాలరాజు తలారి, ధర్మ సమాజ్ పార్టీ నుండి శంభుగళ్ల లక్ష్మయ్య, విద్యార్థుల రాజకీయ పార్టీ నుండి శ్రేనివాస్ బాదావత్, ఒక్కో సెట్ నామినేషన్ వేశారని కలెక్టర్ పాటిల్ తెలిపారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

● గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పలువురు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వివిధ మండలాల నుండి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువకులు పార్టీలో చేరారు. వేంపల్లి గ్రామ మాజీ ఎంపిటిసి రాజన్న ఆధ్వర్యంలో గ్రామం నుండి నార్ల అంజయ్య(మాజీ సర్పంచ్), నార్ల నరహరి (మాజీ సర్పంచ్), కార్యకర్తలు పార్టీలో చేరారు. సర్పంచ్ జక్క గంగాధర్ ఆధ్వర్యంలో మాజీ యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు ఏట్టాం హన్మాండ్లు యాదవ్, కార్యకర్తలు చిట్టి పటేల్, లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుండి యువకులు సుమారు 100 మంది పార్టీలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్తీక్, నక్క స్వామి, ప్రశాంత్, సాయి కుమార్, మోర్తాడ్ మండలం గాండ్లపేట్ గ్రామ బిజెపి నాయకులు మామిడి శేఖర్, ముద్దం గంగాధర్, కంది శశి కుమార్, ఒల్లెపు గణేష్, ముద్దం చిన్ని గంగాధర్, ముద్దం పెద్ద గంగాధర్, ముద్దం అశోక్, ముద్దం బాలు మంత్రి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. వేల్పూర్ మండలం జానకం పెట్ గ్రామం నుండి కుర్మ యాదవ చైతన్య యూత్ అధ్యక్షులు వాళ్ళేం మహేష్, ఉపాధ్యక్షులు స్వామి, కార్యదర్శి రాజశేఖర్, క్యాషియర్ మోహన్, యూత్ సభ్యులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. భీంగల్ మున్సిపాలిటీ బాపూజీ నగర్ కు చెందిన మైనారిటీ యువకులు జుబేర్ నాయకత్వంలో పలువురు పార్టీలో చేరారు. ముచ్కూర్ నుండి జాంబవ యూత్, శివగంగ యూత్ యువకులు 70 మంది, బిజెపి సీనియర్ నాయకులు ఒరగంటి ముత్తెన్న, కార్యకర్తలు, ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు గంధం వెంకన్న, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి ప్రశాంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ మంత్రి ప్రశాంత్ రెడ్డి విజయమే లక్ష్యంగా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.



గులాబీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి

మంత్రికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన రజక సంఘం ఒరగంటి పంథా, భీంగల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన శివగంగ యూత్(గంగపుత్ర) ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. అభివృద్ధి ప్రదాత వేముల ప్రశాంత్ రెడ్డికే మా ఓటు అంటూ పలువురు సంఘ నేతలు ముక్త కంఠంతో నినదించారు. అందుకు సంబంధించిన తీర్మాన పత్రాలు గురువారం మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భాషోపాధ్యాయుల సమావేశం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలకేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న అధ్యక్షతన తెలుగు సముదాయ సమావేశం నిర్వహించారు. ఉన్నతి కార్యక్రమం, లక్ష ప్రణాళిక ప్రకారంగా ఉపాధ్యాయుల బోధన తీరు, బేస్ లైన్ టెస్ట్ నిర్వహించిన తీరు, ప్రగతి నమోదు, నిర్మాణాత్మక-సంగ్రహణాత్మక పరీక్షల నిర్వహణ తీరు చర్చించారు. సమావేశంలో జిల్లా తెలుగు రిసోర్స్ పర్సన్ ప్రవీణ్ శర్మ, కాంప్లెక్స్ కార్యదర్శి పుట్టా రాజేశ్వర్ భాషోపాధ్యాయులకు సలహాలు సూచనలను అందించారు. కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు పతాని గంగాధర్, శ్యామ్ చరణ్, కైలాస్, గీత, కమ్మర్ పల్లి, మోర్తాడ్ ఏర్గట్ల మండలాల తెలుగు భాషోపాధ్యాయులు 30 మంది పాల్గొన్నారు.

16న మార్కెట్ యార్డు తిరిగి ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ది నిజామాబాద్ మర్చంట్స్ అసోసియేషన్ వారి కోరికమేరకు దీపావళి పండుగ సందర్భంగా శ్రద్ధానంద్ గంజు మార్కెట్ యార్డు నిజామాబాద్ ను ఈనెల 10 నుండి 15 వరకు వ్యాపార లావాదేవీలు జరుపబడవు అని, రైతులు మార్కెట్ యార్డుకు సరుకు తీసుకరావద్దని, తిరిగి ఈనెల 16 నూతన వ్యాపార కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారస్తులు, కార్మికులు అందరూ సహకరించాలని కోరారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలి

● ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజనరేంద్రగౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బీసీ డిక్లరేషన్‌ను విజయవంతం చేయాలని ఓ బీసీ జిల్లా అధ్యక్షులు రాజనరేంద్రగౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను విస్మరించిందన్నారు. బీసీ సంక్షేమ శాఖలో రుణాల కోసం దరఖాస్తులు వెయ్యిల కొద్ది పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బీసీలకు కొంత మందికి రుణాలు ఇచ్చి మరికొందరికి రుణాలు అందించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌లో బీసీలోని అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కామారెడ్డిలో నేడు జరిగే బీసీ డిక్లరేషన్‌కు కర్ణాటక సీఎం సిద్దిరామయ్య వస్తున్నారని, దీనికి బీసీలు పెద్దఎత్తున తరలిరావాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీసీలు ఏకమై దొరపాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి బీసీలను తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఓబిసి అధ్యక్షుడు బాసోళ్ల నాగరాజు, కాంగ్రెస్ అర్బన్ కోఆర్డినేటర్ బొబ్బిలి రామకృష్ణ, ఓ బి స జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ధాత్రిక భాస్కర్, బాత్నాతే శంకర్, శీలమంతుల రాజు, దిలీప్ లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓబీసీ జిల్లా అధ్యక్షులు

కాంగ్రెస్‌లో చేరిన పంచరెడ్డి చరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పంచరెడ్డి చరణ్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అర్బన్ పార్టీ అభ్యర్థి షబ్బీర్ అలీ సమక్షంలో చరణ్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ పంచరెడ్డి చరణ్ కుటుంబంతో తనకు 35 ఏళ్లుగా అనుబంధం ఉందని గుర్తు చేశారు. తనకు అర్బన్ టికెట్ ఖరారైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుంచి దూరంగా ఉన్న చరణ్ సొంత గూటికి చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. విద్యార్థులను యువతను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను యువతను ఏకం చేసి ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని, రాబోయే రోజుల్లో నిజామాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, నగేష్ రెడ్డి, భక్తవత్సలం ,దయాకర్ గౌడ్ ,మీసాల సుధాకర్ రావు ,తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, అర్బన్ ఇంచార్జ్ తాహెర్బిన్ హుందాన్ తదితరులను శాలువాలతో సన్మానించారు.



కండువావేసి ఆహ్వానిస్తున్న షబ్బీర్ అలీ

ఈసారి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్‌ల్లో ఈసారి భూపతి రెడ్డి తప్పకుండా విజయం సాధిస్తారని, కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మండల నాయటకులు అన్నారు. గురువారం నిజామబాద్ లో భూపతిరెడ్డిని జక్రాన్‌పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలుగా మండలంపై చాలా చిన్న చూపు చూశారని బాజిరెడ్డి గోవర్ధన్‌పై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తూ డాక్టర్ భూపతి రెడ్డిని ఎమ్మెల్యేగా చూడడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో యువజన విభాగం జక్రన్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సొప్పరీ వినోద్ మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్, కాశిరెడ్డి బాజన్న, రిక్కల తిరుపతి, జైడి మల్లేష్, గడ్డం సంజు రెడ్డి, లోక జాలం, జనార్ధన్, శ్రీనివాస్, బెంజిమెన్, వెంక టేష్, సైకిల్ టెక్స్ అక్బర్, నైమత్ అలి, నియమ త్ అలి, రూరల్ యూత్ జనరల్ సెక్రెటరీ సొప్పరీ సుధీర్, యువ నాయకుడు సొప్పరీ ప్రేమ్ సాయి , సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సైకిల్‌పై వెళ్లి నామినేషన్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి కామ్రేడ్ శివకుమార్ పార్టీ శ్రేణులతో సైకిల్ పై ఎన్ఆర్ భవన్ నుండి మున్సిపాలిటీ వరకు భారీ ర్యాలీ తో వెళ్లి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్యలు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పై పోరాడే వారిని అసెంబ్లీకి పంపాలని నిజామాబాద్ నగర ప్రజలను కోరారు. పేదల ఇళ్ల స్థలాల సమస్యపై, తాగునీటి సమస్య పై, డబుల్ బెడ్ రూమ్ లకై, ఉద్యోగాల భర్తీకై, హాస్పిటల్ సమస్యలపై, కార్మికుల ఉపాధి భద్రతకై,నగరం లో మహిళ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలని, నగరంలో రోడ్లు బాగు చేయాలని ఆందోళన చేసిన చరిత్ర పార్టీకి ఉందని వారు అన్నారు. డబ్బు, మద్యం, ఆకర్షణీయమైన హామీలు ఇచ్చి మళ్లీ ప్రజల్ని మోసగించే కుట్ర బిఆర్ఎస్ ,బిజెపి, కాంగ్రెస్ చేస్తున్నాయని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటికో ఉద్యోగం అని మాట ఇచ్చి కెసిఆర్ నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం ఆడారని వారన్నారు. బిజెపి మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యత దెబ్బతిస్తుందని వారు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలని దాసు, భూమయ్య కోరారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ అభ్యర్థి శివకుమార్, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బి సూర్య శివాజీ, పరుచూరి శ్రీధర్, ఎండి కాజా మొయినుద్దీన్, నీలం సాయిబాబా, బి భూమన్న, గౌతమ్, కూమనపల్లి భూమన్న, దేశెట్టి సాయి రెడ్డి, జేల్లా మురళి, వనమాల సత్యం, గంట్యాల రమేష్, జేపీ గంగాధర్, జన్నారపు రాజేశ్వర్, పోశెట్టి, బండమీది నరసయ్య ,అగ్గు ఎర్రన్న, గోపాల్, అనిత, భారతి, కృష్ణగౌడ్, మోహన్, పాల్గొన్నారు.



సైకిల్‌పై నామినేషన్‌కు వెళ్తున్న కామ్రేడ్ శివకుమార్

నాగపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించిన దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ కార్యాలయాన్ని గురువారం టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామం నుండి అత్యధికంగా ఓట్లు కారు గుర్తుకు పడేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డిని ముచ్చటగా మూడోసారి గెలిపించుకుంటే గ్రామం మరింత అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యుడు అంగరి రాజేశ్వర్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సదుల రాజన్న, బిఆర్ఎస్ ఎస్ సి సెల్ మండల నాయకులు పాలెపు రవి కిరణ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బూత్‌ల్లో అధిక ఓట్లు పడేలా చూడాలి

● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అబ్జర్వర్ అబేద

నవతెలంగాణ-మాక్లూర్

బూత్ స్థాయిల్లో అధిక ఓట్లు పడేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అబ్జర్వర్ అబేద తెలిపారు. గురువారం మండల కేంద్రంలో అసెంబ్లీ అబ్జార్ వైర్ అబెద అధ్వర్యంలో బూత్ స్థాయిలో ఎన్నికల పనులను పరిశీలించారు. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో వచ్చే ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహాల గురించి చర్చించారు. గ్రామాల్లో బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి అధిక ఓట్లు వచ్చే విధంగా కష్టపడి పని చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అధికంగా ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల మైనార్టీ అధ్యక్షులు అలిమ్, సోషల్ మీడియా ఇంఛార్జి జైల్ సింగ్, నాయకులు స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్జర్వర్ అబేద

ఆలోచించి ఓటు వేయండి

- సభలో మంత్రి కేటీఆర్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా జీవన్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ నేతల సమక్షంలో జీవన్ రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం పార్టీ శ్రేణులు నినాదాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. కేటీఆర్‌కు వేలాది మంది ప్రజలు ఘన స్వాగతం పలికారు. పోతురాజు విన్యాసాలు, మంగళహారతులు, బతుకమ్మలతో 20వేల మంది మహిళలు నృత్యాలు చేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలూర్ బై పాస్ రోడ్ మీదుగా ఎమ్మార్వో ఆఫీస్ కు భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ ఆద్యంతం యువకులు టపాసులు పేల్చారు. అభివందనం చేస్తూ ర్యాలీలో ఎన్నికల ప్రచార రథంపై టీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అన్నా అని పిలిస్తే నేనున్నా అని వాలిపోయి సమస్యలు పరిష్కరించే నేత జీవన్ రెడ్డి అని అన్నారు. జీవన్ రెడ్డి మా కుటుంబ సభ్యుడని, ఆర్మూర్ అభివృద్ధి ముందుకు సాగాలంటే మళ్లీ జీవనే గెలవాలని, నియోజకవర్గం అభివృద్ధి కోసం కొట్లాడే నేతను మళ్లీ గెలిపించుకుంటేనే ఆర్మూర్ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కర్ణాటక, బీజేపీ గుజరాత్ నోట్ల మాయలో పడకండని అన్నారు. 50 ఏండ్లు కరెంటు, సాగు, తాగు నీళ్లివ్వకుండా అరిగోస పెట్టిన కాంగ్రెస్ ఒక్క చాన్స్ అంటూ మళ్లీ రావడం సిగ్గుచేటని తెలిపారు. కాంగ్రెస్ కావాలా? కరెంటు కావాలా?. ఆలోచించి ఓటేయండి అని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో తెలంగాణ బతుకుచిత్రం మారుస్తుందన్నారు. రూ.16 వేలకు రైతు బంధు పెంపుతో వ్యవసాయం మరింత బలోపేతం కానుందని, సౌభాగ్యలక్ష్మి ద్వారా ప్రతీ నెలా రూ.3వేల భృతి, ఆసరా పెన్షన్లు రూ.5వేలకు పెంపు, బీసీల పథకాలు, దళితబంధు అందిస్తామని చెప్పారు. గిరిజనేతరులకు కూడా పోడు భూములు ఇచ్చే అంశం పరిశీలిస్తా మనడం, ఆరోగ్యశ్రీ పథకం రూ. 15 లక్షలకు పెంపు, అర్హులైన వారందరికీ రూ. 400కే సిలిండర్, తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం వంటి పథకాలు రాబోతున్నాయని తెలిపారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా పేరుతో 93 లక్షల మందికి లబ్ధి జరిగేలా రూ. 5 లక్షల బీమా పథకం, అసైన్డ్ భూములు ఉన్నవారికి భూ హక్కులు, ఇంటి స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు వంటివి పేదప్రజల బతుకు చిత్రం మార్చే నిర్ణయాలు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

నామినేషన్ కార్యాక్రమానికి అశేష జనవాహిని...

నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి గురువారం నామినేషన్ వేసిన కార్యక్రమంలో అశేష జనవాహిని పాల్గొనడం బీఆర్ఎస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నింపింది. ముఖ్యంగా మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం. నామినేషన్ వేయడానికి ముందు జీవన్ రెడ్డి తన ఆరాధ్య దైవమైన సిద్ధులగుట్ట శివుడివద్ద బీ-ఫామ్ ఉంచి పూజలు నిర్వహించారు. జీవన్ రెడ్డి తన సతీమణి రజితారెడ్డి, తన సోదరుడు రాజేశ్వర్ రెడ్డితో కలిసి తల్లి తండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. తన చెల్లె బావల ఆశీర్వాదం కూడా పొందిన తరువాత సతీ మణి, కుమార్తెలతో కలిసి పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెర్కిట్ లో గల హనుమాన్ ఆలయంలో, వెంకటేశ్వర కాలనీలో గల వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేశారు.

ప్రశాంత్‌రెడ్డిని..
అధిక మెజారిటీతో గెలిపించాలి

- బీఆర్ఎస్ నాయకుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. ముఖ్య నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ చేసిన సంక్షేమ పథకాలను అలాగే గెలుపొందిన తర్వాత అమలుచేసే సంక్షేమ పథకాలను గడపగడపకు తిరుగుతూ వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇందులో భాగంగా ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధు సూదన్, సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, వైస్ చైర్మన్ సిగసారం గంగారాం, మాజీ ఎంపీటీసీ వడ్ల గంగాధర్,నాయకులు చిన్నయ్య,పోశెట్టి,పొలింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మళ్లీ ఆదరించండి

- నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- అభిమానుల మధ్య ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు


ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సారంగాపూర్ ఆంజనేయ ఆలయంలో ఆంజనేయ స్వామి, వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని నామినేషన్ పత్రాలకు పూజలు చేశారు. అనంతరం ఆయన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి హెూమాలు, పూజలు చేశారు. అనంతరం నివాసం నుండి నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులతో కలిసి నిజామాబాద్ పట్టణంలో ప్రధాన రహదారి గుండా ర్యాలీగా నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయానికి వెళ్ళి రిటర్నింగ్ ఆఫీసర్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. తదిపరి బాజిరెడ్డి గోవర్ధన్ మీడియాతో మాట్లాడుతూ... నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. నామినేషన్‌తో పాటుగా అఫిడవిట్, బిఫాం కూడా ఇచ్చానని అన్నారు. శాసనసభ్యుడి పదవిలో ప్రజల కోసం పనిచేయాలని, ప్రజలు నచ్చి, మెచ్చే విదంగా ఉండాలని, ప్రజా సమస్యలపై పనిచేయాలని అన్నారు. యువకులు, ప్రజల సహకారంతో ఈసారి కూడా ఘనవిజయం సాధించి, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మరోసారి ప్రజల సేవకు పునరంకితం అవుతానని అన్నారు. పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ఇంటికి ఏదో పథకం అందుతుందని, బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో అద్భుతంగా ఉందని అన్నారు. కర్ణాటక లో కాంగ్రెస్ పార్టీ వారు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులు ఎత్తివేశారని తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీకి ఎదురు లేదని, కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అని అన్నారు. ప్రతిపక్షాలకు అభ్యర్థులు దొరకడం లేదని, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎవరితో జరుగుతుందో ప్రజలకు పూర్తి అవగాహన ఉందని, ఎవరిని గెలిపించాలో ప్రజలకు తెలుసునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ నిజామాబాద్ రూరల్ ఎలక్షన్ ఇంచార్జ్ గంగాధర్ గౌడ్, ధర్పల్లి జెడ్పిటిసి జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ , డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ , నూడ చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నా జీవితం ప్రజా సేవకే అంకితం

- కాంగ్రెస్ హయాంలోనే నిజామాబాద్ అభివృద్ధి
- ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి
- నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా షబ్బీర్ అలీ నామినేషన్ దాఖలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నా జీవితం ప్రజా సేవకు కాంగ్రెస్ పార్టీకే అంకితం అని మాజీ మంత్రి నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షబ్బీర్ అలీ అన్నారు. నా జీవితం అంతా ప్రజాసేవకేనని, బిజేపీ, బిఆర్ఎస్ నాయకుల వలే నాకు ఎలాంటి వ్యాపారాలు లేవని, ఫుల్ ప్లేజ్ గా రాజకీయ నాయకుడినని పేర్కోన్నారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్య ర్థిగా మొహమ్మద్ అలీ షబ్బీర్ నామినేషన్ దాఖలు చేశారు. నామి నేషన్ దాఖలు చేసిన అనంత రం మీడియాతో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజాధనాన్ని దోచుకున్న దొంగలని విమర్శించారు. కాంగ్రె స్ హయాంలో చేసిన అభివృద్దే తప్ప అధికార పార్టీ నాయ కులు చేసిందేమీ లేదని మండి పడ్డారు. నిజామాబాద్ అర్బన్ నుంచి దరఖాస్తు చేసుకున్న 13 మంది అభ్య ర్థులు స్వచ్ఛందంగా తనను పోటీ చేసేందుకు ఆహ్వా నించి మద్దతు తెలిపారని షబ్బీర్ ఆలీ అన్నారు.తాను మంత్రి గా ఉన్నప్పుడే నిజామాబాద్ ఉమ్మడి జిల్లాతో అనుబంధం ఉందన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గా డిచ్ పల్లిలో 400 కె.వి. సబ్ స్టేషన్ తో పాటు ఎన్నో సంక్షేమ కార్య క్రమాలు చేశానన్నారు. తాను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా, రాష్ట్ర మంత్రిగా ఉమ్మడి జిల్లాలో సహచరులతో తనకు మంచి సంబంధాలు ఉన్నా యన్నారు. గత కాంగ్రెస్ పార్టీ డి.శ్రీనివాస్ ప్రభుత్వ హయాం లో ప్రజలకు 20వేల ప్లాట్లను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరు ద్యోగులకు ఆశ చూపించి మోసం చేయడంతో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజలకు సేవ చేసే పార్టీ అని 34 ఏళ్ల నా రాజకీయ అనుభవంలో ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం గా ముందుకెళ్తున్నానని అన్నా రు. ప్రజా సంక్షేమమే ధ్యేయం గా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. నిజామాబాద్ నగర డెవలప్ మెంట్ అనేది ఆగిపోయిందని తాను గెలిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు డిక్లరేషన్ లను కచ్చితంగా ప్రభుత్వం ఏర్పాటు నుంచే అమలు చేస్తామన్నారు. నిజా మాబాద్ అర్బన్ ప్రజలు ఒక్కసారి అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి అని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, మాజీ ఎమ్మెల్సీఆకుల లలిత, కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశవేణు, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హాందాన్, కాంగ్రెస్ నాయకులు రత్నా కర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బిగాల నామినేషన్ దాఖలు

- అమ్మ, అమ్మమ్మ ఆశీర్వాదం తీసుకున్న గణేష్‌గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా తన అమ్మ అమ్మమ్మ ఆశీర్వాదం ఎమ్మెల్యే గణేష్ బిగాల తీసుకొని నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చారు. ఆయనతో పాటు తమ్ముడు మహేష్ బిగాల ఉన్నారు.


అమ్మ అశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే

c
m
y
k

హామీలను విస్మరించిన బీఆర్ఎస్

- నియోజకవర్గంలో నాసిరకం పనులు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్



మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలను మభ్యపెట్టి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మరోసారి తప్పుదోవ పట్టించే అధికారంలోకి రావాలని చూస్తుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. గురువారం భీంగల్ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మాజీ విప్ అనిల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, తన సతీమణి లతో కలిసి నామినేషన్ వేశారు. అనంతరం పట్టణ కేంద్రంలోని సుభాష్ నగర్ నుండి అంగడి బజార్ నంది గల్లి మీదుగా ముచ్కూర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ .. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇల్లు లేని వారందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఏకకాలంలో రుణమాఫీ లాంటి హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార దాహంతో విస్మరించారన్నారు రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ ఐదు సంవత్సరాల తర్వాత రుణమాఫీ చేశారని, అవి రైతులు తీసుకున్న రుణాలకు వడ్డీలకిందనే సరిపోలేవని అన్నారు.

నియోజకవర్గంలో నాసిరకం పనులు

బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి నాసిరకం పనులు చేపట్టడంతో ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో రాజకీయ లబ్ధి పొందేందుకు భీంగల్ పట్టణ కేంద్రంలో మూతపడ్డ డిపోను తెరిపిస్తున్నట్లు హంగు ఆర్భాటాలు చేశారని కానీ అక్కడ ఏ ఒక్క ఆర్టీసీ అధికారులు గానీ దానికి సంబంధించిన పెట్రోల్ బంకులు కానీ ఏర్పాటు చేయకపోవడం చూస్తుంటే ఇది ఓట్ల కోసం చేసిన ఎత్తుగడేనని తెలుసుకోవాలన్నారు భీంగల్ పట్టణ కేంద్రంలో 100 కోట్లతో అభివృద్ధి చేశానని చెబుతున్న మంత్రి ఉన్న రోడ్లపైనే డాంబర్ వేసి ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏకాకాలంలో రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకాకాలంలో రెండు లక్షల రూపాయలను రుణమాఫీ చేయనున్నట్లు సునీల్ కుమార్ తెలిపారు. రైతుబంధు కింద 15 వేల రూపాయలు, ఉచిత విద్యుత్తు అందజేయనున్నట్లు తెలిపారు.

మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2500 రూపాయలు పెన్షన్లు అందజేయనున్నట్లు తెలిపారు. కనుక కాంగ్రెస్ పార్టీని ఆదరించి చేయి గుర్తుకు ఓటు ఓటు వేయాలని ప్రజలను కోరారు.

ఈ నామినేషన్ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని 8 మండలాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో కిసాన్ కేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేంద్ర, నాయకులు కుంట రమేష్ అనంతరావు గోపాల్ నాయక్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కడ్తాలేకుండా కొనాలి

- రైతు సంఘం

నవతెలంగాణ-మాక్లూర్



వడ్లను పరిశీలిస్తున్న నాయకులు

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులోగల 44వ జాతీయ రహదారిపై తడిసిన ధాన్యాన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం పరిశీలిం చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని ఏమాత్రం కడ్తా లేకుండా, సకాలంలో బస్తాలను పంపించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభులు, మండల కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. కొనుగోలు కేంద్రాలనుంచి ధాన్యం వెంటనే తరలించాలని, రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు ఇడగొట్టి సాయిలు, రైతులు పాల్గొన్నారు.



ఘనంగా విజయ్ పాఠశాల 43వ వార్షికోత్సవం

- అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

విజయ్ పాఠశాల అధ్వర్యంలో మామిడిపల్లి శివారులో గల అపురూప వెంకటేశ్వర ప్రాంగణం లో ఏర్పాటు చేసిన 43వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీదేవి తెలంగాణ అధికార భాష సంఘం చైర్‌పర్సన్, గౌరవ అతిథిలుగా సినీ నటి రాజశ్రీ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్ హాజరయ్యారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. విజయ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును ఇస్తూ ముందుకు వెళ్లడం ఎంతో గర్వ కారణం అని అన్నారు. 43 సంవత్సరాలుగా పాఠశాలను నడుపుతూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్ది ఉన్నతమైన స్థానాలలో నిలబెట్టిన ఘనత కూడా పాఠశాలకు ఉందన్నారు. ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు చూయించుకుంటూ అన్నం తిని పెంచే రోజులు వచ్చాయి. కానీ మా రోజుల్లో చందమామను చూపించి అన్నం తినిపించే తల్లిదండ్రులు ఉండేవారని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచితే మంచిదని హితవు పలికారు. విద్యార్థులు ఏ రంగంలో నిష్ణాతులో వారిని ఆ రంగంలో రాణించేలా ప్రోత్సహించాలని వారు కోరారు. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు అవసరమని తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడమే ఇలాంటి సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణం అని అన్నారు. పాఠశాల యాజమాన్యాన్ని ఆదర్శంగా తీసుకొని వారికి సపోర్ట్ చేస్తున్న తల్లిదండ్రులకు కూడా ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే తమకు చదువు చెప్పిన గురువుల పేరు నిలబెట్టాలని అన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు..



సాంస్కృతిక కార్యక్రమంలో చిన్నారులు

వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు 2022-23 సంవత్సరానికి అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభా పురస్కారాలను అందించారు. అనంతరం ముఖ్య అతిథులను విజయ్ పాఠశాల తరపున మెమెంటో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అమృతలత, తార, రమాదేవి, లలిత దేవి, విజయ భారతి, విజయ లక్ష్మి, మధు, కరస్పాండెంట్ ప్రభాదేవి అకాడమిక్ డైరెక్టర్ వసంత అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ సుజాత ప్రిన్సిపల్ విజేత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న జీవన్‌రెడ్డి

నామినేషన్ వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నామినేషన్లకు నేటితో గడువు ముగియనుండగా పలుచోట్ల అభ్యర్థులు భారీ ర్యాలీలతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. గురువారం పట్టణంలో బిఆర్ఎస్ అభ్యర్థి ఆశన్న గారి జీవన్ రెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వినోద్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి రజిత రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

నామినేషన్ కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నామినేషన్ నిజామాబాద్ అర్బన్, రూరల్ కేంద్రాల వద్ద ఇరు పార్టీల నాయకులు నామినేషన్ వేసే క్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అధికార పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. అధికారంలో ఉన్నామని ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కు తున్న చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ప్రశ్నించారు. ఇంత జరుగుతున్న పోలీసులు బీఆర్ఎస్ నాయకులకు వత్తాసు పలుకుతూ ప్రేక్షక పాత్ర వహి స్తున్నారంటూ ధ్వజమెత్తారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బీర్ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి, నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ నిజామాబాద్ నగరంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను ఏసిపి కిరణ్ కుమార్ సముదాయించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

బోధన్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా షేక్ జలీల్

నవతెలంగాణ-నవీపేట్



బోధన్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నవీపేట్‌కు చెందిన షేక్ జలీల్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎంపీటీసీగా పోటీ చేసిన షేక్ జలీల్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేయాలనే ఉద్దేశంతో నామినేషన్ వేసినట్లు తెలిపారు. బోధన్ ప్రజల ఆశీర్వాదంతో ఇండిపెండెంట్‌గా గెలిచి సేవ చేస్తానని అందరు సహకరించాలని కోరారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్



నూతన కార్యర్గంతో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్టు ముఖ్య కార్యదర్శి డాక్టర్ భాను రామగిరి గురువారం తెలిపారు. ఎన్నికలను రిటర్నింగ్ అధికారి డాక్టర్ అశోక్ నిర్వహించారు.. 20 23-24 సంవత్సరానికి ఐఎంఏ నూతన అధ్యక్షునిగా డాక్టర్ వెంకట్ గౌడ్, కార్యద ర్శిగా డాక్టర్ భాను రామగిరి, కోశాధికారిగా డాక్టర్ రాకేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఎన్నికల సరళి రాజ్యాంగబద్ధంగా అందరి ఆమోదంతో సజావుగా జరిగిందని పలువురు డాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీకు ఆర్మూర్ గురుకుల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు డి. రాజేష్ ఐ. సాయి కిరణ్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ ఏ. దుర్గారెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 2 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉప్పల్ లో అండర్ 19 హ్యాండ్ బాల్ సెలక్షన్స్ నిర్వహించారన్నారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సాంఘిక సంక్షేమ వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, శ్రీధర్, సురేష్, రాములు, సురేష్, చెన్నారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుల కే. రాజేందర్, అర్జున్, టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ స్టూడెంట్స్ ను అభినందించారు.

c
m
y
k

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో యూనివర్సిటీ పురుషుల జట్టు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కబడ్డీ పురుషుల జట్టు గురువారం నుండి 12 వరకు అంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కాకినాడలో జరుగు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి బయల్దేరిందని యూనివర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ డాక్టర్. జి.బాలకిషన్ తెలిపారు. ఈ జట్టు కు మేనేజర్‌గా డా. బీఆర్. నేత కోచ్ గా ఎం. ప్రశాంత్ లను నియమించినట్లు డైరెక్టర్ తెలిపారు. క్రీడాకారుల ను అందరిని అభినందిస్తూ కబడ్డీ టోర్నమెంట్‌లో మంచి ప్రతిభ కనబరిచి వర్సిటీకీ, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలను తీసుకు రావాలని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ ఈ కబడ్డీ జట్టుకు కోచ్‌గా నియమితులయ్యారు.

పోరాట ఫలితమే పరీక్ష ఫీజులు తగ్గింపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులు నాలుగో రోజు గురువారం పరీక్ష ఫీజులు తగ్గించాలని ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఫీజులు తగ్గిస్తున్నారని చెప్పారని, పిడిఎస్‌యు నిజామాబాద్ నగర అధ్యక్షులు ఎస్కే అషూర్ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మూడు రోజులుగా గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో సెమిస్టర్ పరీక్ష ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉద్యమం చేశారన్నారు. ఈ పోరాట ఫలితంగానే ఫీజులు తగ్గించారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల పి.డి.ఎస్.యు. నాయకులు సలీం,మంగ, నాగేష్, నజీర్, నయుం, సందీప్, వినోద్, ప్రదీప్ పాల్గొన్నారు.

వాలీబాల్‌కు ఎంపికైన మగ్గిడి పాఠశాల పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

వాలీబాల్ అండర్ 19 ఎస్ జి ఎఫ్ టోర్నమెంట్ కు మండలంలోని మగిడి పాఠశాల పూర్వ విద్యార్థులు సాయి తేజ, బాలరాజ్ ఎంపికైనట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మధు గురువారం తెలిపారు. ఇరువురు నేటి నుంచి సిద్దిపేట లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని అన్నారు. ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, సర్పంచ్ సుమలత, నర్సయ్య,, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీలో రిమాండ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలో ఆరు ట్రాక్టర్ల బ్యాటరీలు దొంగతనం చేసిన వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. తేదీ ఈనెల 7న రాత్రి సమయంలో కలిగోట గ్రామంలో ఆరు ట్రాక్టర్ల బ్యాటరీలు దొంగతనం చేశారని కలిగొట్ చెందిన అల్లూరి సంతోష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. గురువారం గాంధీనగర్ వద్ద వాహనాల తనిఖీ చేయుచుండగా టీవీఎస్ ఎక్సెల్ పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అనుమానంతో పట్టుకొని విచారించగా దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి 6ఆరు బ్యాటరీలు స్వాధీనం చేసుకొని రిమాండు కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

నేటి నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కోల వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వినయ్ రెడ్డి నేడు నామినేషన్ వేస్తున్నారని, ఈ నామినేషన్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోల వెంకటేష్ పార్టీ శ్రేణులను, ప్రజలను కోరారు, ఇంకో 20 రోజుల్లో ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకు పట్టిన జీవన్ రెడ్డి అని పీడ విరగడు అవుతుందని, కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సాయిబాబ గౌడ్, బ్లాక్ అధ్యక్షులు విట్టం జీవన్, రవికాంత్ రెడ్డి, మీసాల రవి,రమణ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం సమస్యను పరిష్కరిస్తుంది

ఐఐఏఎం మీడియేటర్ శర్మ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ న్యాయ శాస్త్ర కళాశాలలో మధ్యవర్తిత్వం - సవాళ్లు అనే అంశంపై గురువారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా ఐఐఏఎం మీడియేటర్ కే.స్. శర్మ మాట్లాడుతూ. న్యాయస్థానాలలో లిటిగేషన్ అనేది కాలాన్ని, ధనాన్ని వృధా చేస్తుందని. మానవీయ సంబంధాలను దూరం చేస్తుందని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం సమస్యను పరిష్కరించి స్నేహపూరితమైన వాతావరణాన్ని నెలకొల్పుతోందని పేర్కొన్నారు. మంజీరా వెంకటేష్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వివిధ దశల గురించి అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వం ప్రధానంగా మానవ సంబంధాలను మెరుగుపరిచి మంచి సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. పంతాలు పట్టింపులు అనేక సమస్యలను సృష్టిస్తున్నాయని, అవి మధ్యవర్తిత్వం తోనే పరిష్కరించు కోవాలని సూచించారు. ఈ వర్క్ షాప్‌నకు న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి డాక్టర్ కే ప్రసన్న రాణి అధ్యక్షత వహించారు. న్యాయ కళాశాల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా, డా.బి.స్రవంతి, డాక్టర్ నాగజ్యోతి, డా.రామలింగం, డా. నర్సయ్య, డా.ప్రవీణ్ వివిధ శాఖల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు అవకాశం ఇవ్వండి

- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి
- నామినేషన్ సందర్భంగా సిరన్‌పల్లిలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నవీపేట్



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ప్రజా సమస్యలను పరిష్కరించి సేవ చేసుకొనే అవకాశం ఇవ్వాలని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి కోరారు. ఆయన స్వగ్రామం మండలంలోని సిరన్ పల్లిలోని స్వగృహంలో పూజలు నిర్వహించి తల్లిదండ్రుల దీవెనలు తీసుకున్నారు. స్థానిక హనుమాన్ ఆలయంలో నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు బోధన్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన ఏఐసీసీ, పీసీసీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో చేసిన ప్రజాసేవ కంటే మరొకసారి అవకాశం ఇస్తే మరింత సేవ చేసి చూపిస్తానని అన్నారు. ప్రస్తుతం ప్రజా సమస్యలు మరింత పెరిగాయని, వాటిని పరిష్కరించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ వేసేందుకు బోధన్ వెళ్లారు. వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ కోసం పెద్ద సంఖ్యలో బయలుదేరారు.

11న మాదిగ ఉపకులాల విశ్వరూపం మహాసభ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 11న పరేడ్ గ్రౌండ్ జరిగే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ యూనివర్సిటీ ఓల్డ్ బాయ్స్ హాస్టల్ లో ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు దినేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు వెంకటరమణ పోస్టర్లను అవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రజలు, విద్యార్థులు లక్షలాదిగా తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జయంత్, ఆశిష్, ప్రభు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ కోసం ఎస్‌టిఓ, ఏపీపిఓ కార్యాలయాలకు వెళ్లొద్దు

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సర్వీసు పెన్షనర్ లేదా సర్వీస్ పెన్షనర్ మరణించిన భర్త లేక భార్య ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్ గురించి ఎస్‌టిఓ, ఏపీపిఓ కార్యాలయాలకు వెళ్ళవలసిన అవసరం లేదని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రామ్మోరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ ఫోలియో లేదా జీవన్ ప్రమాన్ ద్వారా మాత్రమే సబ్మిట్ చేయాలన్నారు. వీరు కాక ఇతర ఫ్యామిలీ పెన్షనర్లు విడో డాటర్స్, డైవర్స్‌డ్ డాటర్స్, దివ్యాంగ సంతానం, సర్వీసు పెన్షనర్లపై ఆధారపడి సర్వీసు పెన్షనర్ మరణానంతరం ఫ్యామిలీ పెన్షన్ పొందేవారు మాత్రమే వ్యక్తిగతంగా ఎస్ టి ఓ, ఏపీపిఓల వద్ద ఫారం నింపి యివ్వాలని తెలిపారు. స్పౌజ్ ఫ్యామిలీ పెన్షనర్లు మాత్రం టియాప్ ఫోలియో లేదా జీవన్ ప్రమాన్ ద్వారా మాత్రమే పంపాలని పేర్కొన్నారు.

కుమ్మరి శాలివాహన సంఘం మండల కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా అన్నారం శ్రీనివాస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కుమ్మరి శాలివాహన సంఘం ఇందల్ వాయి మండల నూతన కమిటీ ని బుధవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన అన్నారం శ్రీనివాస్ ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా కె గంగాధర్, పి. గంగాధర్,కె మోహన్, ప్రధాన కార్యదర్శి గా కె. పోశెట్టి, సహాయ కార్యదర్శిగా వి.రమేష్, ఎ.శేఖర్, కోశాధికారిగా కె. శేఖర్, ముఖ్య సలహాదారులుగా కె. సాయి, కె. రాజన్న, ఎ.ప్రవీణ్, భాస్కర్, శ్రీనివాస్, సదానంద్‌ను ఎన్నుకున్నారు. సభ్యులుగా కె. శ్రీనివాస్, మోహన్, గంగాప్రసాద్. జి. అంజయ్య, ఎ. గంగాధర్ ,శ్రీకాంత్, కె. సాయిలు. కె. మహిపాల్, దశరథ్, వెంకటిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అన్నారం శ్రీనివాస్ మాట్లాడుతూ .. మండలంలోని కుమ్మరి శాలివాహన సభ్యులను మండల కమిటీ చూసుకుంటుందని అన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షులుగా నియమించిన కుమ్మరి శాలివాహన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికలు శాంతియుతంగా జరుపుకోవాలి

మూఢనమ్మకాలపై కళాజాత బృందం అవగాహన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ కలిగొట్ గ్రామంలో ప్రజలకు ఓటు విలువపై నాటిక, పాటలతో అవగాహన కల్పించారని ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పండుగను అందరు ఎలాంటి గొడవలు లేకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు ఓటు విలువ తెలుసుకుని ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని కోరారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. మహిళలకు నిజామాబాద్ షీ టీమ్ రక్షణ కల్పిస్తుందని కళాజాత బృందం తెలిపారు. మొబైల్ ఫోన్ దొంగతనానికి గురైనా, పోగొట్టుకున్న సిఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరి చేస్తారని వగాహన కల్పించారు. అత్యవసరసమయంలో డయల్ 100 ఉపయోగించుకోవాలని సూచించారు. మూడ నమ్మకాలు నమ్మవద్దు, మంత్ర తంత్రాలు పారదోలాలని అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని, తెలిపారు. ఆన్లైన్ మోసాలు గురించి అప్రమత్తంగా ఉండాలని వివరించారు. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న వారు నకిలీ ఏజెంట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు, 150 మంది ప్రజలు పాల్గొన్నారు.

మూడవసారి షకీల్ విజయం తథ్యం


ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత, షకిల్

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-బోధన్

బోధన్ అసెంబ్లీ బరిలో ఉన్న ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ మూడోసారి భారీ విజయం సాధించబోతున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ ఆమేర్ నామినేషన్ సందర్భంగా పాల్గొని అనంతరం విలేకరులతో మాట్లాడారు. బోధన్ నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న షకిల్ ఆమెర్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని అన్నారు. నామినేషన్ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలిరావడం ఒక విజయోత్సవ సభలా ఉందని హర్షం వ్యక్తం చేశారు. బోధన్‌లో ఎందరో సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఉన్న ఇప్పటివరకు ఏమి చేయలేదని అన్నారు. 30వ తేదీన జరిగే ఎన్నికలలో షకీల్‌కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని, సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ మాట్లాడుతూ.. తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తన నామినేషన్‌కు భారీగా హాజరు కావడం సంతోషకరమన్నారు. తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రత్యర్థులకు ఈ ఎన్నికలలో కనీసం డిపాజిట్ రాదని అన్నారు. ఎమ్మెల్సీ కవిత తన నామినేషన్‌కు రావడం శుభ సూచకమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో సాలూర మండలం పార్టీ అధ్యక్షులు నరసయ్య, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, గిర్దావర్ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

స్కూటీపై ఎమ్మెల్సీ కవిత..

ఎన్నికల నామినేషన్ల సందర్భంగా గురువారం ఎమ్మెల్సీ కవిత భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. దాంతో ఆమే ఓ కార్యకర్త స్కూటీపై నామినేషన్ల కేంద్రానికి రావలసి వచ్చింది.

అండర్ 19 వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

- అభినందించిన ప్రిన్సిపాల్


ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-రెంజల్

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో ఆదర్శ పాఠశాలకు చెందిన వైష్ణవి బైపీసీ ప్రథమ సంవత్సరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయిందని పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వైష్ణవికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈనెల 10 నుంచి 12వరకు సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక


సురేందర్ ఆధ్వర్యంలో పలువురు చేరిక

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన సుమారు 60మంది మహిళలు యువకులు ఇతర పార్టీలకు చెందిన నాయకులు గురువారం ఎమ్మెల్యే ఫామ్‌హౌస్ వద్ద ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వ పథకాలను చూసి పార్టీలో చేరుతున్నట్లు ఆయన అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా ఉన్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఆకర్షితులవుతున్నారని వారి నమ్మకం మీద వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు చెప్పే మాటలు విని మోసపోవద్దని కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీ జనసందోహం మధ్య అభ్యర్థుల నామినేషన్లు

- కార్యకర్తలతో కిక్కిరిసిన బోధన్



నామినేషన్ దాఖలు చేస్తున్న షకీల్

నవతెలంగాణ-బోధన్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బోధన్ పట్టణం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, జనసందోహంతో కిక్కిరిసి పోయింది. వివిధ మండలాల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో పార్టీల జెండాలతో పట్టణం రంగులమయం అయింది. ఎంపీ ధర్మపురి అర్వింద్, అభ్యర్థి మోహన్ రెడ్డితో కలిసి ప్రచార రథంపై నామినేషన్ కేంద్రానికి తరలివచ్చారు. కళాకారులు నృత్యాలు చేస్తూ అలరించారు. ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఆచన్ పల్లి అప్నా ఫంక్షన్ నుంచి ఎమ్మెల్సీ కవితతో కలిసి భారీ జనం మధ్య ర్యాలీగా తరలివచ్చారు. జనంతో ట్రాఫిక్ ఇబ్బందుల వలన ఎమ్మెల్సీ కవిత కార్యకర్త స్కూటీపై నామినేషన్ కేంద్రానికి వచ్చారు. అలాగే సుదర్శన్ రెడ్డి పలు మండలాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి నామినేషన్ వేయడానికి వచ్చారు.

నామినేషన్ వేసిన వారు..

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ షకీల్ ఆమేర్ తన సతీమణి ఆయేషా ఫాతిమా, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మండల అధ్యక్షులు నర్సయ్య, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, గిర్దావర్ గంగారెడ్డి తదితరులతో కలిసి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి తన అనుచరులతో ఎల్లయ్య, శ్రీనివాస్‌తో కలిసి నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థి మోహన్ రెడ్డి ఎంపీ ధర్మపురి అర్వింద్, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు బసవ లక్ష్మీనర్సయ్యతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. బీఎల్ఎఫ్ అభ్యర్థి మోసిన్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి నాఖరాజ్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజాగౌడ్ నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

కామారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది

- జిల్లా పరిషత్ ఫోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి


ఆలయం వద్ద మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డిలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని, గంప గోవర్ధన్ ఓటమి ఖాయమని తెలిసి, ఉపముఖ్యమంత్రి కాబోతున్న షబ్బీర్‌అలీని ఓడించడానికి కెసిఆర్ రంగంలో దిగగానే, రేవంత్‌రెడ్డి గమనించి, కేసీఆర్‌ను ఓడించడానికి కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగాడని, కాంగ్రెస్ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి కామారెడ్డిలో రేవంత్ రెడ్డిని లక్ష పైచిలుకు మెజార్టీతో గెలిపించాలని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మద్దికుంట శ్రీ స్వయం బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో రేవంత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పూజలు నిర్వహించారు. అనంతరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అధికార పార్టీ మోసపూరిత హామీలను నమ్మవద్దని, గ్రామాల్లో డబల్ బెడ్ రూమ్, దళిత బంధు, బీసీ బందు, గృహలక్ష్మి ఇచ్చిన వారిని బిఆర్ఎస్ ఓట్లు అడగాలని, కాంగ్రెస్ కార్యకర్తలు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన, కాంగ్రెస్ హయాంలో రుణమాఫీ, ఆరోగ్యశ్రీ వంటి లబ్దిపొందిన కుటుంబాలను, 6 గ్యారంటీలను వివరిస్తూ, కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ఓట్లు అడగాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లచ్చిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెండ్యాల నర్సారెడ్డి, గజ్జల చిన్న రాజు, బొమ్మిడి రఘుపతి, తోట లింగం, నాగరాజు, రాజు, లింగం, నారాయణ తదితరులున్నారు.

పాత వర్నిలో బీఆర్ఎస్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని పాతవర్ని గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం చేపట్టారు. పార్టీ ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను, చేయబోయే సంక్షేమ పథకాల మేనిఫేస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ్, సంతోష్ కులకర్ణి, మాజీ ఉపసర్పంచ్ నారాగౌడ్, స్వామిగౌడ్ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ యువకుల ఆత్మీయ సమ్మేళనం..

మండలంలోని శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ యువజన సంఘం సభ్యులతో సిసిడి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనానికి యువత అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని అధ్యక్షులు పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి డిసిసిబి చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఇంచార్జి పోచారం సురేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కోసం బైక్‌ర్యాలీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ వేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి సుదర్శన్ రెడ్డికి మద్దతుగా యువత బైక్ ర్యాలీతో తరలి వెళ్లారు. సాటాపూర్ చౌరస్తా నుంచి వందలాది మంది యువత బోధన్‌కు తరలివెళ్లారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలలోని మసానిపల్లి, భిక్కనూర్ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసీ ఉషగౌడ్, మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు నాగం సురేందర్, జగన్ గౌడ్, రఘువీర్ గౌడ్, శ్రీకాంత్, పద్మారావ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్

- నామినేషన్ దాఖలు చేసిన బిఆర్ఎస్ నాయకులు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా జాజాల సురేందర్ తరపున ఎల్లారెడ్డి జెడ్పిటిసి ఉషా గౌడ్, నాగిరెడ్డిపేట జడ్పిటిసి మనోహర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారి ప్రభాకర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతోపాటు నాయకులు పోచయ్య ఇమ్రాన్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్ ఆదేశాల మేరకు నామినేషన్ దాఖలు వేసామని తెలిపారు.

రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-కోటగిరి

కాంగ్రెస్ పార్టీలో అలుపెరుగని పోరాటం చేస్తూ బాన్సువాడ నియోజకవర్గంలో కాసు ల బాలరాజ్ కాంగ్రెస్ పార్టీని కాపాడినా.. పురుగుమందు సేవించి ఆసుపత్రి పాలైన కాసుల బాలరాజు వెంటనే కోలుకోవాలని కోరుకుంటూ, దీనికి కారణమైన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను గురువారం మండల కేంద్రంలో బీసీ వర్గానికి చెందిన నాయకులు ఆనంద్, రాజు, పీరయ్య తదితరులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీ కాంతారావు గెలుపునకు కృషి చేస్తాం

నవతెలంగాణ-పిట్లం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీ కాంతారావు గెలుపు దిశగా కృషి చేస్తామని చిన్నకొడప్‌గల్ గ్రామ ఎంపీటీసీ వెంకట్ రామ్‌రెడ్డి, ఆయన అనుచరులు అన్నారు. గురువారం మండలంలోని చిన్నకోడప్‌గల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తోట లక్ష్మీ కాంతారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సింగిల్ విండో పరిధిలో ధర్మారం, అల్లాపూర్, బుర్నాపూర్, కాటేపల్లి, కొడప్గల్ గ్రామాల సుమారు 300మంది బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీకాంతారావు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వెంకట్‌రెడ్డి అనుచరులైన మల్లప్ప పటేల్, మొగుల గౌడ్ పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట లక్ష్మీ కాంతారావు గెలుపుకై శక్తిసామర్థ్యాల మేరకు కృషి చేస్తూ 30 వేల లీడుతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామ్‌రెడ్డి మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు జోన్న మోహన్‌రెడ్డి, మాజీ డిసిసిబి డైరెక్టర్ చింతల సాయి రెడ్డి, బొడ్ల రాజు, కృష్ణరెడ్డి, మరగల దయాకర్, ఆయా గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

యజమానితో నేను



బైక్‌పై కుక్కను తీసుకువెళ్తున్న యజమాని

నవతెలంగాణ-రామారెడ్డి

విశ్వాసానికి మారుపేరు కుక్క. యజమానితో పాటు నేను సైతం అంటూ, బైకుపై బయలుదేరింది శునకం. వేములవాడ పట్టణానికి చెందిన సంచర జాతికి చెందిన గంగాధర్ గ్రామాల్లో తిరుగుతూ చిన్నచిన్న వస్తువులు విక్రయిస్తూ కుటుంబంతో జీవిస్తుంటాడు. గ్రామగ్రామాలు తిరుగుతూ.. గురువారం రామారెడ్డి మండల కేంద్రానికి తన బైక్‌పై వస్తుండగా యజమాని బైక్‌పై తన కుక్క ఉండటంతో గమనించి నవతెలంగాణ ఇలా క్లిక్ మనిపించింది.

తల్లి లాంటి కాంగ్రెస్‌ను వదులుకోను

- 13వరకు హైకమాండ్ నిర్ణయం కోసం వేచిచూద్దాం
- కాంగ్రెస్ గెలుపు కోసం కట్టుబడి పని చేద్దాం
- మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం
- స్వతంత్ర్య అభ్యర్థిగా, కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం

నవతెలంగాణ-మద్నూర్

తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని వదులుకునే ప్రసక్తే లేదని పార్టీకి కట్టుబడి జీవితాంతం పార్టీకే అంకితమవుతానని, ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకే పని చేద్దామని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హనుమంత్ షిండేను 50వేల ఓట్ల మెజార్టీతో ఓడిద్దామని కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సౌదాగర్ గంగారాంకు కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ టిక్కెట్టు ఇవ్వకుండా కొత్త వ్యక్తి తోటా లక్ష్మి కాంతారావుకు టికెట్ ఇచ్చినందుకు గురువారం మండల కేంద్రంలోని మైథిలీ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్తాయి కార్యకర్తలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బతికి ఉందంటే సౌదాగర్ గంగారంతోనేనని ముఖ్య నాయకులంతా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ మైకమాండ్ ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో టికెట్టు వస్తదా రాదా అనేదానిపై వేచి చూద్దామని, టికెట్టు రాని యెడల కాంగ్రెస్ పార్టీకే కట్టుబడి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపే లక్ష్యంగా కృషిచేయాలని అన్నారు. చేతు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని చిత్తుగా ఓడిద్దామని గత పది సంవత్సరాల కాలంగా ఇక్కడ పార్టీ ఎమ్మెల్యే లేకపోవడం కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఈసారి కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి గెలుపు కోసం కృషి చేద్దామని అన్నారు. అంతకుముందు కార్యకర్తల అభిప్రాయం మేరకు జుక్కల్ అసెంబ్లీకి తమ నామినేషన్లను రెండు సెట్ల అందజేశారు. ఒకటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, మరొకటి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు.

లోకల్ బచావో.. నాన్ లోకల్ హటావో..

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-జుక్కల్

లోకల్ బచావో.. నాన్ లోకల్ హటావో అని జుక్కల్ ఎమ్మెలే హన్మంత్ షిండే అన్నారు. గురువారం మండలంలోని కేమ్రాజ్‌కల్లాలీ, మహమ్మదాబాద్, పెద్దగుల్లా, గుల్లా తాండా, చిన్న గుల్లా, కంతాలీ, లొంగన్, చిన్నఎడ్గి, బస్వాపూర్, కౌలాస్ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేమ్రాజ్‌కల్లాలీలో మహిళలు మంగళ హరతులతో నృత్యాలు చేస్తూ డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయనమ్మ ఊరు కావడంతో చిన్ననాటి నుంచి ఇక్కడ ఉండి గ్రామస్తులతో అనుబంధం ఉండటంతో సెంటిమెంట్‌గా మొదట కల్లాలీ నుంచే ప్రచారాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పడి వరకు కల్లాలీ గ్రామానికి 71మందికి కళ్యాణలక్ష్మీ అందిందని, 281 మందికి ఆసరా



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

పెన్షన్ ఇస్తున్నామని, 331 మందికి కంటివెలుగులో కండ్ల అద్దాలు పంపిణీ చేశామని అన్నారు. అదేవిధంగా 971 మంది రైతులకు రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నామని, 253 మందికి కేసీఆర్ కిట్లు బాలింతలకు అందించామని అన్నారు. 44మందికి గొర్ల యూనిట్లను గొల్ల, కుర్మలకు అందచేశామని, 48మందికి ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించామని తెలిపారు. కారుగుర్తుకు ఓటేయ్యాలని, తనను గెలిపించాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని అర్హులైన వారందరికి ఒకేసారి దళితబంధు, మహిళలకు సౌభాగ్యలక్ష్మీ కింద ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మహమ్మదాబాద్‌లో మాట్లాడారు. కేసిఆర్ నాయకత్వంలో హ్యాట్రిక్ సాధిస్తామని, పెండింగ్ పనులు రాబోయే రోజుల్లో పూర్తి చేస్తామని అన్నారు. మహమ్మదాబాద్ యువకుడు తమ గ్రామానికి అభివృద్ధి చేయలేదని వాహనాల వద్ద గళాటా చేయగా, బీఆర్ఎస్ నాయకులు, పోలీసులు సముదాయించడంతో శాంతించాడు. కార్యక్రమంలో విండోచైర్మెన్ శివానంద్, కల్లాలీ మాజీ సర్పంచ్ సుంకరి వెంకన్న, మహమ్మదాబాద్ సర్పంచ్ లక్షెట్టి సాయిలు, పెద్దగుల్లా సర్పంచ్ రుక్మినిబాయి, చిన్నగుల్లా శోభా, కంతాలీ శాంతాబాయి, లొంగన్ ఉషారాణీ, చిన్నఎడ్గి శాలినీబాయి పటేల్, బస్వాపూర్ రవిశంకర్ పటేల్, కౌలాస్ గొల్ల హన్మండ్లు, కపిల్ పటేల్, బొంపెలి రాములు, బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, సాయాగౌడ్, గంగాధర్, జాదవ్ రాజు, రామన్న, విఠల్‌పటేల్, జ్ఞానేశ్వర్, సదుపటేల్, శీవాజీపటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన డీసీసీబీ చైర్మన్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజకవర్గ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పో చారం శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ పత్రాలను తనయుడు డిసిసిబి చైర్మన్ దాఖ లు చేయగా నేడు ఆయన స్వయంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే నేడు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నసురుల్లాబాద్ మం డలం నెమలి గ్రామానికి చెందిన పందిరీ గంగామని అనే మహిళ నామినేషన్ వేశారు. బాన్సువాడ నియోజకవర్గం పోటీ చేసేందుకై ఇప్పటికి 18 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి భుజంగరావు తెలిపారు.

ధర్మానికి, అధర్మానికి మధ్యన ఎన్నికలు

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

త్వరలో జరగనున్న ఎన్నికలు ధర్మానికి అధర్మానికి మధ్యల కొనసాగుతున్నాయని.. ఎన్నికల్లో ధర్మమే గెలుస్తుందని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ అన్నారు. గురువారం మండల సమీపంలోని జీఎన్ఆర్ గార్డెన్లో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఆత్మగౌరవంతో స్థానిక నాయకులకే పట్టం కడతారని ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు డబ్బుల సంచులకు లొంగరని, కొందరు నాయకులు గ్రామాల్లోకి డబ్బుల సంచులతో వచ్చి దేవుని మీద ప్రమాణం చేపించి డబ్బులు పంచాలని చూస్తున్నారని ప్రజలు మాత్రం అభివృద్ధికి పట్టం కడతారన్నారు. డబ్బులు పంచే నాయకులు దేవుని మీద ప్రమాణం చేపిచ్చే నాయకులు ప్రజలకు సేవ చేయరని వారికి తగిన గుణపాఠం ఎన్నికల్లో చెప్తారన్నారు. స్థానిక నాయకులకు బాధ్యతలు అప్పగించకుండా ప్రచారానికి రాయలసీమ, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి తన అనుచరులను తెప్పించుకొని ప్రచారం చేస్తున్నారని స్థానిక ప్రజల నాయకులు ఆత్మగౌరాన్ని అవమానిస్తున్నారని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గ ప్రజలు కలిసికట్టుగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. అనంతరం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జనార్ధన్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ టికెట్లు స్థానికులకు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి టికెట్లు అమ్ముకుందని ఆయన మండిపడ్డారు. నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. 100 పడకల ఆసుపత్రితో పాటు ఎల్లారెడ్డి బస్టాండ్, లింగంపేట్ బస్టాండ్ రూపురేఖలు మార్చిన ఘనత స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కి దక్కిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దివిటి రమేష్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, నల్లమడుగు సింగిల్‌విండో చైర్మన్ రమేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరహరి, రైతుబంధు మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ గరీబుని నయీమ్, వైస్ ఎంపీపీ విటల్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలి

నవతెలంగాణ-కామారెడ్డి

రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని వంద శాతం ఓటింగ్ జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ఓటర్లందరూ నిష్పక్షపాతంగా, స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమని, 18 సంవత్సరాలు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లందరూ పోలింగ్ రోజు ఎక్కడికి వెళ్లకుండా బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకొని సత్తా చాటాలన్నారు. నూతన యువ ఓటర్లు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో పాల్గొని తొలి ఓటు అనుభూతి పొందాలని అన్నారు. ప్రజాస్వామ్య భారత దేశంలో అన్ని దేశలకంటే యువత ఎక్కువగా ఉన్నారని, రాజకీయ నిర్ణయాధికారం యువతదేనని, చైతన్యవంతులై వందశాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటర్లను మభ్యపెడ్తూ డబ్బు, మద్యం, ఏదైనా వస్తువుల పంపిణీ జరిగితే, సి- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లందరికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తామని, 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఓటు హక్కు వినియోగించు కొనేందుకు ఫొటోతో ఉన్న ఓటరు కార్డ్ లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన మరో 13 రకాల గుర్తింపు కార్డ్‌లో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని అన్నారు. ఓటర్ ఎపిక్ కార్డు, ఆధార్ కార్డు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్డ్, బ్యాంక్/పోస్ట్‌ఆఫీస్ (ఫోటోతో ఉన్నవి) పాస్‌బుక్‌లు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగులకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ సంస్థలు/పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డ్, దివ్యాంగుల గుర్తింపు కార్డ్, ఎదో ఒక గుర్తింపు కార్డ్‌ను తీసుకొని పోలింగ్ స్టేషన్ కి వచ్చి ఓటు వేయాలన్నారు.

సునీల్ రెడ్డి గెలవాలని 101 కొబ్బరికాయలు కొట్టిన కార్యకర్త

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ గెలవాలని ఆశిస్తూ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త శివసరం గణేష్ దంపతులు పెద్ద గుట్ట లక్ష్మీనరసింహస్వామికి 101 కాయలు కొట్టారు. గురువారం పెద్దగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఒక్కో మెటుకు ఒక కొబ్బరికాయ చొప్పున 101 మెట్లకు కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం లక్ష్మినరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివసరం గణేష్ మాట్లాడుతూ బాల్కొండ ఎమ్మెల్యేగా ముత్యాల సునీల్ కుమార్ గెలవాలని వేడుకుంటూ కొబ్బరికాయలు కొట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చిమల్లయ్య, నిమ్మప్రసాద్, శ్రవణ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.